
సంపుటి :02 సంచిక :168 పేజీలు :07 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 26, ఆగస్టు 2025





## అక్షర దర్బార్ పాఠకులకు
# వినాయక చవితి శుభాకాంక్షలు!

ప్రియమైన పాఠకులారా,ఈ వినాయక చవితి పండుగ మీ జీవితాల్లో కొత్త కాంతిని నింపాలని, ప్రతి అడుగులోనూ విజయాన్ని, ఆనందాన్ని తీసుకురావాలని కోరుకుంటున్నాం. వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవత. ఆయన ఆశీస్సులతో మీ కలలన్నీ సాకారం కావాలని, మీరు చేసే ప్రతీ పనిలోనూ జయం కలగాలని ఆశిస్తున్నాం.అక్షరాల వెలుగులో పయనించే అక్షర దర్బార్‌తో కలిసి, ఈ పండుగ రోజున సరికొత్త ఆశయాలతో ముందడుగు వేయండి. ఈ శుభ సందర్భంలో, జ్ఞానం, సంతోషం, శ్రేయస్సు మీ సొంతం కావాలని ఆకాంక్షిస్తున్నాం.మీకు, మీ కుటుంబ సభ్యులకు వినాయక చవితి శుభాకాంక్షలు!

- ఎడిటర్ వేముల రాజేశ్వరరావు

వానకాలానికి ముందే ఈసారి రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు తాకాయి. ఇక ఈ సీజన్లో కాలం బాగా అవుతుందని, వ్యవసాయానికి డోకా ఉండదని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. జూన్, జూలై నెలల్లో సరైన వర్షపాతం నమోదు కాక ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక దశలో కాలం కలసి రాదని కూడా భావించారు. కానీ, అనూహ్యంగా ఆగస్టులో వర్షపాతం ఊపందుకున్నది. ఆగస్టు ముగిసే నాటికి ఉమ్మడి జిల్లా పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగాం, భూపాలపల్లి, ములుగు జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. చెరువులు, వాగులు, నదులు, చెక్డ్యాంలు అన్నీ జలకళను సంతరించుకున్నాయి. మొత్తానికి ఈ సీజన్ లో కరువుదీరా వర్షం కురిసిందని, సాగునీటికి ఇక డోకా లేదని చెప్పవచ్చు. – అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



# జలమ్ము నిశ్చయమ్మురా!

**ఉమ్మడి జిల్లాలో కరువుదీరా వానలు**

04

- ఐదు జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం
- భూపాలపల్లిలో సగటు కంటే 7 మి.మీ తక్కువ
- నిండుకుండల్లా చెరువులు, సరస్సులు, వాగులు, చెక్ డ్యాంలు
- దర్జాగా సాగు చేసుకుంటున్న రైతన్నలు

## 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 29న మంత్రివర్గ భేటీ
- స్థానిక ఎన్నికలు, కాళేశ్వరం నివేదికపై ప్రధాన చర్చ
- లోకల్ ఎలక్షన్‌పై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం
- అసెంబ్లీలో అనుసరించే విధానాలపైనా సీఎం స్పష్టత

04

## చైన్ స్నాచర్ ఆటకట్టు

- అంతర్ జిల్లా దొంగ అరెస్ట్
- రూ. 23.50 లక్షల విలువైన బంగారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్‌సింగ్

04




## పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం

- ఈ నెల 28న ఓటర్ జాబితా ముసాయిదా ప్రదర్శన
- 28 నుంచి 30వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- వచ్చే నెల 2న తుది ఓటర్ల జాబితా
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. దీనిలో భాగంగా మంగళవారం వార్డుల వారీగా ఓటరు జాబితా (ఫొటో ఎలక్టోరల్ రోల్స్)ను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ రాణి కుముదిని ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, అదనపు కలెక్టర్లు సహా పలువురు అధికారులను ఆదేశించారు. అయితే, ఈ ఉత్తర్వులు హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు వర్తించవని పేర్కొన్నారు.

– అక్షరదర్బార్, హైదరాబాద్




**28ఆగస్టు2025** ఓటరు జాబితా ముసాయిదా తయారీ, ప్రదర్శన

**31ఆగస్టు2025** అభ్యంతరాల పరిష్కారం

**29ఆగస్టు2025** జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు

**2సెప్టెంబర్ 2025** తుది ఓటరు జాబితాల ప్రచురణ

**30ఆగస్టు2025** మండలస్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు

వార్డుల వారీగా ఓటరు జాబితా

**28 నుంచి 30 వరకు** అభ్యంతరాల స్వీకరణకు అవకాశం

ఈ ఉత్తర్వులు హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు వర్తించవు

# మట్టి వినాయకులను పూజించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను పూజించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తమ సిబ్బందికి సూచించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో చేసిన గణపతి విగ్రహాలను ఆయన మంగళవారం పోలీస్ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రసాయనాలతో తయారుచేసిన గణేష్ విగ్రహాల ద్వారా వాతావరణం కాలుష్యం అవడంతోపాటు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని, రాబోవు తరాల వారికి స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసి పూజలు చేద్దామని తెలపడంతో పాటు సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు ప్రభాకర్ రావుతో పాటు ఏసీపీలు జితేందర్ రెడ్డి, వెంకటేష్, నాగయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్, శ్రీధర్, స్వర్ణన్ రాజు ఆర్ఎస్ఐ శ్రవణ్ తో పాటు పరిపాలన విభాగం సిబ్బంది ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# వీసం భరత్ రెడ్డికి కేటీఆర్ బర్త్ డే విషెష్

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేటీఆర్ సేన అధ్యక్షుడు వీసం భరత్ రెడ్డి  జన్మదినం సందర్భంగా బీఅర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్  జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు భరత్ రెడ్డి హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తెలంగాణ భవన్ కార్యాలయంలో కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.







# జలమ్ము నిశ్చయమ్మురా!

- ఉమ్మడి జిల్లాలో కరువుదీరా వానలు
- ఐదు జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం
- భూపాలపల్లిలో సగటు కంటే 7 మి.మీ తక్కువ
- నిండుకుండల్లా చెరువులు, సరస్సులు
- దర్జాగా సాగు చేసుకుంటున్న రైతన్నలు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:**

వానకాలానికి ముందే ఈసారి రాష్ట్రాన్ని నైరుతి రుతు పవనాలు తాకాయి. ఇక ఈ సీజన్లో కాలం బాగా అవుతుందని, వ్యవసాయానికి డోకా ఉండదని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. జూన్, జూలై నెలల్లో సరైన వర్షపాతం నమోదు కాక ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక దశలో కాలం కలసి రాదని కూడా భావించారు. కానీ, అనూహ్యంగా ఆగస్టులో వర్షపాతం ఊపందుకున్నది. ఆగస్టు ముగిసే నాటికి ఉమ్మడి జిల్లా పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగాం, భూపాలపల్లి, ములుగు జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. చెరువులు, వాగులు, నదులు, చెక్డ్యాంలు అన్నీ జలకళను సంతరించుకున్నాయి. మొత్తానికి ఈ సీజన్ లో కరువుదీరా వర్షం కురిసిందని, సాగునీటికి ఇక డోకా లేదని చెప్పవచ్చు.

**- నిండుగా జల నిధులు..**

దండిగా కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లాలో సుమారు వెయ్యి చెరువులు నిండాయి. పాకాల అభయారణ్యం సమీపంలోని పాకాల సరస్సు నిండి జలకళను సంతరించుకున్నది. సరస్సు ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాంతంలో

**జూన్ నుంచి ఆగస్టు 20 వరకు వర్షపాతం (సగటు మి.మీలో)**

| జిల్లా | సాధారణ వర్షపాతం | నమోదైన వర్షపాతం |
|---|---|---|
| భూపాలపల్లి | 648 | 620 |
| ములుగు | 801 | 807 |
| హనుమకొండ | 541 | 546 |
| మహబూబాబాద్ | 547 | 641 |
| జనగామ | 429 | 482 |
| వరంగల్ | 576 | 736 |

భూగర్భజలాలు పుష్కలంగా ఉండటానికి కారణం ఈ సరస్సే. ములుగు జిల్లాలోని లక్నవరం సరస్సు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యవసాయానికి ప్రధాన నీటి వనరుగా ఉంది. పాలంపేటలోని రామప్ప ఆలయ సమీపంలోని చెరువు అతిపెద్దది. దీని ద్వారా చుట్టుపక్కల సాగుకు సాగునీరు అందుతున్నది. వరంగల్ జిల్లాలోని ఘనపూర్ ఆనకట్టలోకి పుష్కలంగా జలాలు చేరాయి. ఎగువన కురిసి వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. నది ఉమ్మడి వరంగల్ జిల్లా ఉత్తర సరిహద్దు గుండా ప్రవహిస్తుంది. దీని నుంచి నిర్మించిన కాల్వల ద్వారా ఈ ప్రాంతంలోని సాగు భూములకు నీరు అందుతోంది. అలాగే బయ్యారం వాగు, బొగత వాగు, పాలెం వాగులతో పాటు ఈ ప్రాంతంలోని అనేక చిన్న వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ వ్యవసాయానికి నీటిని అందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రైతులు లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, చెరువులు, కుంటల కింద రైతులు ఎక్కవగా ఈ సీజన్ లో వరి పంట సాగు చేస్తున్నారు. అలాగే పత్తి, మక్కలు, అపరాల పంటలు పండిస్తున్నారు.

**- జిల్లాల వారీగా వర్షపాతం..**

వరంగల్ జిల్లాలోని కాపులకనపర్తిలో ఈనెల 11న అత్యధికంగా 21.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లాలో ఇటీవలి భారీ వర్షాల కారణంగా జలదిగ్బంధం ఏర్పడింది. ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం వంటి మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదైంది. భారీవర్షాల కారణంగా నదులు, వాగులు పొంగిపొర్లాయి. జూన్, జూలైలో జయశంకర్ భూపాలపల్లి అత్యల్ప వర్షపాతం నమోదైంది. చివరకు వానలు అందుకుని వర్షపాతం సాధారణ వర్షపాతం అందుకునే వరకు వచ్చింది. ఈ సీజన్ లో సాధారణ వర్షపాతం కంటే, కేవలం 7 మి.మీ మాత్రమే తక్కువ వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో ఈ సీజన్ లో సాధారణంగా సుమారు 541 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే.. 546 మి.మీ వర్షపాతం నమోదుకావడం విశేషం. జనగామ జిల్లాలో వానకాలంలో సగటు వర్షపాతం 429 మి.మీ కాగా, ఇప్పటివరకు 482 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం.

**- నేడూ రేపూ వానలు..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశాలున్నాయి. రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతున్నది. ఈ ప్రభావంతో భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆయా జిల్లాల్లో గంటకు 30–40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి.


# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- 29న మంత్రివర్గ భేటీ
- స్థానిక ఎన్నికలు, కాళేశ్వరం నివేదికపై ప్రధాన చర్చ
- లోకల్ ఎలక్షన్స్పై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం
- అసెంబ్లీలో విధానాలపైనా సీఎం స్పష్టత

అక్షరదర్బార్, హైదరాబాద్: శాసనసభ వేదికగా ఈనెల 30 నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అంతకముందు రోజు సీఎం రేవంత్రెడ్డి ఆధ్వర్యంలో 29న మంత్రివర్గం భేటీ కానున్నది. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది. అలాగే కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో చర్చించనున్న నేపథ్యంలో.. అధికార పార్టీ అనుసరించాల్సిన విధానాలపై చర్చించనున్నారు. ఆ తర్వాత రోజు నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. శాసన సభ్యులు తొలిరోజు ఇటీవల కాలంచేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్కు సంతాపం తెలుపనున్నారు. ఈ సమావేశాల్లోనే ఉపసభాపతి ఎంపిక, కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ జరుగనున్నది.

**- న్యాయకోవిదులతో భేటీ..**

బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన రెండు బిల్లులు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్లో ఉన్నాయి. ఈ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం ఆలస్యం అవుతున్న నేపథ్యంలో, దీనికి సంబంధించి సుప్రీంకోర్టులో జరుగుతున్న కేసులో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్లే విషయంలో ప్రధానంగా ఢిల్లీలో చర్చ జరుగనున్నది. రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్లో ఉన్న రిజర్వేషన్ల బిల్లుల, కోర్టు ఆదేశాల నేపథ్యంలో వివాదాలు తలెత్తకుండా రిజర్వేషన్లు అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బృందం చర్చించనున్నది. హైకోర్టు ఆదేశాల ప్రకారం సెప్టెంబరు 30లోగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాల్సి ఉంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. ఈ నేపథ్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎలా అమలు చేయాలి? ఎన్నికల ప్రక్రియను ఎలా మొదలు పెట్టాలి? అనే అంశాలపై సోమవారం ఢిల్లీలో సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, ఇతర మంత్రుల బృందం సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వితో భేటీ అయ్యారు. మంగళవారం సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి సుదర్శన్రెడ్డితోనూ సీఎం, మంత్రుల బృందం భేటీ అవుతారని తెలిసింది. ఈ భేటీ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ పరంగా బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలా? లేదా ప్రభుత్వపరంగా ఇవ్వాలా అన్న అంశంపై ఒక నిర్ణయానికి వస్తారని తెలిసింది.



# డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

**–సీపీఐ నాయకుడు మంద భాస్కర్**



అక్షర దర్బార్, కేసముద్రం: కిడ్నీ వ్యాధిగ్రస్తుల సౌలభ్యం కోసం కేసముద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిపిఐ మండల నాయకుడు మంద భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యాధికారి నంబికిషోర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "వ్యాధిగ్రస్తులు 20 కిలోమీటర్ల దూరంలోని మహబూబాబాద్ ఆసుపత్రికి వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసముద్రం మున్సిపాలిటీగా ఏర్పడినందున ఇక్కడే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రజలకు చాలా ఉపయుక్తంగా ఉంటుంది" అన్నారు. అలాగే ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, 24 గంటల ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాసు సాయిచరణ్, ఎస్కే ఇమామ్, జూకంటి రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడిని పరామర్శించిన నాగుర్ల



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం నర్సక్క పల్లి గ్రామానికి చెందిన వరికల దేవరావు ద్విచక్ర వాహన ప్రమాదానికి గురికాగా నర్సక్క పల్లి గ్రామంలో దేవరావు నివాసంలో ఆయనను పరామర్శించిన రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు. ప్రమాద సంఘటన గురించి వివరాలు తెలుసుకొని ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వీరి వెంట బిఆర్ఎస్ జిల్లా నాయకులు నాగూర్ల సంతోష్, వరికెల కిషన్ రావు, లోనే సతీష్, మొకిడి రాజయ్య, మోడే మోహన్ రావు, సురావు రాజయ్య, మూర్తల దేవేందర్, గ్రామ కమిటి అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక శోభ

- రేపటి నుంచి వినాయక చవితి వేడుకలు
- ఉత్సవాలకు మండపాలు ముస్తాబు
- పూజ సామగ్రి కొనేవారితో వరంగల్ నగరంలో సందడి
- ఉత్సవాల ఏర్పాట్లలో కమిటీ సభ్యులు బిజీ బిజీ



అక్షరదర్బార్, వరంగల్ : వినాయక చవితి ఏడాదిలో జరుపుకొనే తొలి పండుగ. బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల్లో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. ఇప్పటికే ఉత్సవ నిర్వాహకులు వినాయక విగ్రహాలను మండపాలకు తీసుకువచ్చారు. ముఖ్యంగా వరంగల్ నగరంలో వినాయక విగ్రహాల అమ్మకాల సందడి కనిపిస్తున్నది. వీధులు, రోడ్లు పండుగను సంతరించుకున్నాయి. భక్తులు వినాయకుడికి జాజికాయ, జాపత్రి, కలువలు, తామర పువ్వులు, వెలక్కాయలు కొంటూ బిజిబిజీగా కనిపిస్తున్నారు. మరోవైపు మున్సిపాలిటీ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంచుతున్నారు. ఎకో గణపతి ఉద్యమం నడిపిస్తున్నారు.

## - పండుగ ప్రాశస్త్యం..

'భాద్రపద శుద్ధ చవితి' రోజునే వినాయకుడి జననం జరిగిందని కొందరు.. గణాధిపత్యం వచ్చిందని కొన్ని పౌరాణిక గాథలు వ్యాప్తిలో ఉన్నాయి. విఘ్నేశ్వరుడి పుట్టిన రోజు.. గణాధిపత్యం పొందిన భాద్రపద శుద్ధ చవితిని 'వినాయక చవితి' లేదా వినాయక చతుర్ది పండుగను జరుపుకొంటారు. ఆ రోజునే వినాయకుడు పుట్టాడని.. గణాధిపత్యం పొందాడని పలు పురాణ కథలు ప్రచారంలో ఉన్నాయి. వినాయక చవితి రోజున ప్రాతఃకాలమే లేచి ఇంటిని శుభ్రం చేయాలి. తర్వాత తలంటు స్నానం చేసి ఉతికి వస్త్రాలను ధరించాలి. మామిడాకుల తోరణాలు కట్టి, ఇంటిని అలంకరించాలి. ఓ పీటకు పసుపు రాసి ఇంటికి ఈశాన్య భాగంలో లేదా ఉత్తర దిక్కులో ఉంచాలి. ఓ పళ్లెంలో బియ్యంవేసి వాటిపై తమలపాకులు పెట్టుకోవాలి. అగరువత్తులు వెలిగించి, దీపారాధన తర్వాత ఈ కింది మంత్రాన్ని ఉచ్చరిస్తూ పూజను ప్రారంభించాలి.శ్లోకం: 'ఓం దేవీంవాచ మజనయంత దేవాస్తాం విశ్వరూపా: పశవో వదంతి.. సానో మంద్రేష మూర్జం దుహానాధే నుర్వాగాస్మానుప సుష్టుతైత్తు అయం ముహూర్తస్సుముహూర్తోస్తు' య శ్శివో నామరూపాభ్యాం యా దేవీ సర్వ మంగళా తయో స్సంస్మరణా త్పుంసాం సర్వతో జయమంగళం' అని చదువుకోవాలి.

## - నిబంధనలు తప్పనిసరి..

మండపం ఏర్పాటు కోసం ఆన్ లైన్ లో పర్మిషన్ తప్పనిసరి. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా policeportal.tspolice.gov.in అనే వెబ్సైట్ ద్వారా అనుమతులు తీసుకోవాలి. విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ కట్టండి. విద్యుత్ అధికారుల పర్మిషన్ తీసుకోండి. మండపాల నిర్మాణ పనులు నిపుణులకు అప్పగించండి. విద్యుత్ పనులు సొంతంగా చేయొద్దు. మండపాల కోసం రోడ్లను పూర్తిగా బ్లాక్ చేయొద్దు. ప్రజలకు అసౌకర్యం కలిగించొద్దు. డీజేలకు అస్సలు అనుమతిలేదు. రాత్రి 10గంటల తర్వాత మైక్ వాడొద్దు. మైక్ లు వాడేటప్పుడు సౌండ్ లెవెల్స్ ప్రభుత్వ నిబంధనల మేరకే ఉండాలి. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి. వర్షా లను దృష్టిలో పెట్టుకొని మండపాలు, ఇతర ఏర్పాట్లు చేయాలి. భక్తుల తాకిడికి తగినట్లుగా మండపాల వద్ద ఏర్పాట్లు తప్పనిసరి. వాహనాలు పార్క్ చేసుకొనేందుకు ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ కు ఆటంకం కలిగించొద్దు. భక్తులను గైడ్ చేసేలా వలంటీర్లను నియమించండి. ముఖ్యంగా ట్రాఫిక్, క్యూలై న్లను నియంత్రించేందుకు. మండపాల వద్ద తగిన శుభ్రత పాటించాలి. పాయింట్ బుక్ ఏర్పాటు చేయాలి. మండప నిర్వాహకుల కమిటీ సభ్యుల పూర్తి వివరాలు (పేరు, తండ్రిపేరు, ఫోన్ నంబర్, చిరునామా), కమిటీ ప్రెసిడెంట్/ కన్వీనర్/ సెక్రటరీ ఎవరో స్పష్టంగా నమోదు చేయాలి. అనుమానాస్ప ద వ్యక్తుల కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. విగ్రహం నిమజ్జనం కోసం ప్రభుత్వం/మున్సిపాలిటీ/పోలీస్ శాఖ సూచించిన అధికారిక నిమజ్జన స్థలాలు మాత్రమే వినియోగించాలి. పోలీస్ ఇచ్చిన అనుమతి కాపీని మండపంలో కనబడేలా ప్రదర్శించాలి.

# ఎంజీఎం ఆస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వ్యాధుల కాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వరంగల్ కలెక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కలెక్టర్ సత్య శారద మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలోని ఓపి విభాగంతో పాటు జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, పిల్లల వార్డు, క్యాజువాలిటీ తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా వార్డుల్లో లభిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆస్పత్రిలోని సదుపాయాలు, సౌకర్యాలు రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై ఆమె రోగులతో పాటు వారి బంధువులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం ఆమె ఆసుపత్రి డాక్టర్లతో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న ఈ సమయంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయి, ఏమేమి అవసరాలు ఉన్నాయి, తదితర వివరాలను ఆమె డాక్టర్ల ద్వారా తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు ఎంతమంది ఉన్నారు, ఎంతమంది హాజరయ్యారు, ఎంతమంది గైర్హాజరయ్యారు అని ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. హెచ్ హెచ్ ఎఫ్ అనే ప్రైవేట్ సంస్థ అందించిన వీల్ చైర్లను ఆమె ప్రారంభించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో రోగులకు సూచనలు, సహాయం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించిన ఆమె మరమ్మతులకు ఆదేశాలు ఇచ్చారు.



రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద



పార్టీలో చేరిన వారితో రానా ప్రతాప్ రెడ్డి

# తెలంగాణ ప్రజల చూపు బీజేపీ వైపు

- మార్పు కోసం యువత బీజేపీలో చేరాలి
- జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట: తెలంగాణ ప్రజల చూపు బీజేపీ వైపే ఉందని, మార్పు కోసం యువత పెద్ద ఎత్తున బీజేపీలో చేరాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం ఖానాపురం మండలం కొడ్తిమాటు తండాకు చెందిన భూక్యా రాజేందర్, భూక్యా చరణ్, భూక్యా వంశీ, భూక్యా రాహుల్, గుగులోత్ ప్రశాంత్, భూక్యా నవీన్, గుగులోత్ తరుణ్ తదితర యువకులు బూత్ అధ్యక్షులు గుగులోత్ సతీష్, గుగులోత్ వెంకన్న ఆధ్వర్యంలో, మండల అధ్యక్షుడు రాధారపు అశోక్ సారథ్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి కమలం కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ – "దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర యువతను ఆకర్షిస్తున్నాయి. తెలంగాణ అభివృద్ధి కూడా బీజేపీ ద్వారానే సాధ్యం. రాబోయే రోజుల్లో అన్ని మండలాలు, గ్రామాలనుంచి పెద్ద ఎత్తున యువత బీజేపీలో చేరనుంది. పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ తగిన అవకాశాలు లభిస్తాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వారిని ప్రజాప్రతినిధులుగా ఎదిగేలా చేస్తాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కొడియాల యాకస్వామి, మండల ప్రధాన కార్యదర్శి కలకోటి సహదేవ్, బానోత్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ‘ఉమెన్ బ్లూ కోల్ట్’ ప్రారంభం

## జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: మహిళల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన ‘వుమెన్ బ్లూ కోల్ట్’ కార్యక్రమాన్ని భూపాలపల్లి జిల్లా ఎస్పీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి మహిళా సిబ్బందితో స్కూటీ ర్యాలీకి ప్రారంభ సూచన ఇచ్చారు. భూపాలపల్లి, కాటారం పోలీస్ స్టేషన్లు మరియు షీ టీమ్స్‌కు చెందిన మహిళా సిబ్బందికి స్కూటీలు కేటాయించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ రావు, సిఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



# పంట పొలాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

అక్షర దర్బార్, పరకాల: వరంగల్ రైతు విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తల బృందం నడికూడ మండలంలోని కంటాత్మకూరు గ్రామంలో పత్తి, వరి, పసుపు పంటలను సందర్శించింది. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డా. విజయ భాస్కర్ మాట్లాడుతూ – పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు వేపనూనె (ఎకరాకు 1 లీటర్) లేదా అసిఫేట్ (ఎకరాకు 300 గ్రా) పిచికారి చేయాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుల నివారణకు ఎమమెక్టిన్ బెంజోయేట్ (80 గ్రా/ఎకరా), ఆకు మాడు తెగుల నివారణకు ప్రొపికోనజోల్ (200 మి.లీ/ఎకరా) పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, విశ్వతేజ, పోరిక జైసింగ్, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.



# సీఐటీయూలో చేరిన అంగన్వాడీలు

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అక్షర దర్బార్, పరకాల: నాగారం, ఊరుకొండ సెక్టార్లకు చెందిన 70 మంది అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు మంగళవారం సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ సమక్షంలో సిఐటియులో చేరారు. పరకాలలోని అమరధామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. “అంగన్వాడీలను ప్రభుత్వం 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్య కార్యక్రమాలను ఐసిడిఎస్ సెంటర్ల ద్వారానే నడపాలి” అని డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీలపై అదనపు పనుల భారం మోపరాదని, కనీస వేతనం ₹26,000 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కాసం లీలావతి, దుర్గం రజిత, ఎస్. కోమల, బి. భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దు నిరసన విజయవంతం చేయాలి

## - టీజీఈ జేఏసీ పిలుపు




అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ప్రజా వ్యతిరేకమని, దాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, పెన్షన్ విద్రోహ దినమైన సెప్టెంబర్ 1న నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీ ఈ జేఏసీ (Telangana Gazetted Employees JAC) పిలుపునిచ్చింది. మంగళవారం భూపాలపల్లి టీఎన్జీవో భవనంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో చైర్మన్ బూరుగు రవి కుమార్ మాట్లాడుతూ, "సిపిఎస్ విధానం ఉద్యోగుల భవిష్యత్తును కూలదోస్తోంది. పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించడం తప్ప మరో మార్గం లేదు" అని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 1న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, సెప్టెంబర్ 8న ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే బస్సు యాత్రల్లో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సెక్రటరీ జనరల్ విజయలక్ష్మి కోరారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ, డీటీఎఫ్, టీపీటీఎఫ్, టీఆర్టీఎఫ్, రెవెన్యూ, వ్యవసాయ, వైద్య, ఎన్జీవో తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొని పలు తీర్మానాలు ఆమోదించారు.



# ఒక్కరికి ఒక బస్తా

## పోలీస్ పహారాలో యూరియా పంపిణీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు రోజురోజుకీ తీవ్రతరమవుతున్నాయి. మొగుళ్లపల్లి మండలంలోని మొట్లపల్లి సొసైటీ వద్ద మంగళవారం ఐదు గ్రామాల రైతులు తెల్లవారుజామునే చేరి గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడ్డారు. రైతుల ఆవేదనల మధ్య పోలీస్ పహారాలో ఒక్కరికి ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు ఆగ్రహంతో మాట్లాడుతూ– “చేతికి వచ్చిన పంటకు అత్యవసరమైన యూరియా అందుబాటులో లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. టోకెన్లు ఇచ్చి, ఓటిపి ఇస్తామని మోసగిస్తున్న అధికారులు రైతులను రోజూ నరకయాతన పెట్టుతున్నారు” అని వాపోయారు. గ్రామానికి కేవలం 400 బస్తాలు మాత్రమే రావడంతో ఎక్కువ మంది రైతులు ఖాళీ చేతులతో వెనుదిరగాల్సి వచ్చింది. ముందుగానే సరిపడా యూరియా అందించకపోవడం రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్యం, ప్రజా వ్యతిరేక వైఖరినే బయటపెడుతోందని రైతులు మండిపడుతున్నారు.



బస్తాల కోసం క్యూలైన్ లో నిల్చున్న రైతులు

## యూరియా కోసం రైతులు అరిగోస..

అక్షర దర్బార్, సంగెం: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర నాయకుడు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ రైతులు యూరియా కోసం అల్లాడుతుంటే సీఎం, మంత్రులు మాత్రం బిహార్ ఎన్నికల్లో ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్–బీజేపీ ఎంపీలు రైతు సమస్యలపై మౌనంగా ఉన్నారని విమర్శించారు. బీసీలకు 42% రిజర్వేషన్ ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ వృత్తి అని ఆరోపించారు. రైతు బంధు ఎకరాకు ₹15,000 ఇస్తామని చెప్పి రెండు విడతల డబ్బులు ఎగ్గొట్టారని, వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు



# యూరియా కోసం రైతుల పాట్లు

## –పొద్దంతా సొసైటీల వద్ద పడిగాపులు

అక్షరదర్బార్, కేసముద్రం: పంటలకు యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లారగానే పనులు మానేసి కుటుంబ సభ్యులతో కలిసి రైతులు సొసైటీల వద్ద గంటల తరబడి క్యూ లైన్లలో నిలుస్తున్నారు. మంగళవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రంలో రైతులు యూరియా కోసం బారులు తీశారు. వరి నాట్లు పూర్తయ్యాయి, మొక్కజొన్నకు రెండో దఫా యూరియా వేసే సమయం వచ్చింది. ఈ పరిస్థితుల్లో యూరియా దొరకకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒక రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇవ్వాలన్న ప్రభుత్వ నిబంధనపై రైతులు మండిపడుతున్నారు. వారం రోజులుగా తిరుగుతున్నా యూరియా దొరకకపోవడం వల్ల పంటలు వాడిపోవడం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలానికి సరిపడా యూరియా తక్షణం అందించాలని, రైతు పంటలను కాపాడే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# అంగన్వాడీ సెంటర్లను ఆధునీకరించాలి

## కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించిన అంగన్వాడీ టీచర్లు



అక్షర దర్బార్, చిట్యాల: ప్రీ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడాన్ని విరమించి, ఉన్న అంగన్వాడీ సెంటర్లను ఆధునికరించి ప్రజలకు మరింత దగ్గర చేయాలని అంగన్వాడీ టీచర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. జిల్లా అంగన్వాడీ టీచర్స్ యూనియన్ అధ్యక్షురాలు చింతల సంధ్యారాణి మాట్లాడుతూ – “అంగన్వాడీ సెంటర్లు ఇప్పటికే ఆటపాటలతో పిల్లలకు విద్యా–పౌష్టికాహారం అందిస్తున్నాయి. అయితే, ఆయాలు లేకపోవడం వల్ల టీచర్లే వంటచేసే పరిస్థితి నెలకొంది. సెంటర్ల సమస్యలను పట్టించుకోకుండా, కొత్త ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేయడం నిర్వీర్యం చేసే ప్రయత్నమే” అని విమర్శించారు. సెంటర్లను బలోపేతం చేసి, పక్కా భవనాలు, అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, పిల్లలకు పౌష్టికాహారం–ఆటపాటలతో మరింత మెరుగైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రజిత, కవిత, కరుణ, శ్రావణి, సునీత, శోభ, తిరుపతమ్మ, రజియా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజించాలి

అక్షరదర్బార్, జగిత్యాల : వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలి అని ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ సూచించారు. అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో మట్టి విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ అనిల్ మాట్లాడుతూ – పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాల ప్రతిష్ఠ అభినందనీయమని, వినాయక నవరాత్రులను భక్తి శ్రద్ధలతో, మతసామరస్యంతో జరుపుకోవాలని కోరారు. సంస్థ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ – రసాయనాలతో తయారైన విగ్రహాలు నీటి కాలుష్యానికి దారి తీస్తాయని, జీవవైవిధ్య రక్షణ కోసం మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని ప్రజలను కోరారు.



# చైన్ స్నాచర్ ఆటకట్టు

- అంతర్ జిల్లా దొంగ అరెస్ట్
- రూ. 23.50 లక్షల విలువైన గోల్డ్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను దొంగిలిస్తున్న ఘరానా చైన్ స్నాచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుడి నుంచి రూ.23.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాలు, నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర ప్రాంతానికి చెందిన మంతుర్తి హరీష్(29) ఈ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన హరీష్ గతంలో హైదరాబాద్‌లోని ఒక సిమెంట్ కంపెనీలో క్వాలిటీ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. హరీష్ గతంలో సహోద్యోగి ఇంట్లో బంగారు గొలుసు చోరీ చేసి అరెస్టయ్యాడు. బెయిల్‌పై విడుదలయ్యాక తన జల్సాలకు డబ్బు అవసరమవడంతో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. చైన్ స్నాచింగ్ చేయడానికి ముందుగా ద్విచక్ర వాహనాలను కూడా చోరీ చేసేవాడు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో పది చైన్ స్నాచింగ్‌లు, మూడు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడ్డాడు. కేయూసీ, రాయపర్తి, సుబేదారి, కాజీపేట, హసన్ పర్తి, కమలాపూర్, కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు చేశాడు. వరుస దొంగతనాలతో అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతికత సహాయంతో నిందితుడిని గుర్తించి, యాదవ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని తమ దైన శైలిలో విచారించగా, తాను చేసిన నేరాలను అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన క్రైమ్స్ డీసీపీ గుణశేఖర్, ఏసీపీ (క్రైమ్స్) సదయ్య, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, రాఘవేందర్, ఏఏవో సల్మాన్ పాషా, సీసీఎస్ ఎస్ఐ లు రాజ్‌కుమార్, శివకుమార్ ను పోలీస్ కమిషనర్ అభినందించారు.

అక్షర దర్బార్ Voice of the people
www.aksharadarbar.com
మంగళవారం
26.08.2025


# ఇసుక అక్రమ రవాణాపై నిఘా

- గణేష్ మండపాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చూడాలి
- వినాయక విగ్రహాలను జియో ట్యాగింగ్ చేయాలి
- నెలవారి నేర సమీక్ష సమావేశంలో ములుగు జిల్లా ఎస్పీ డా. శబరిష్



అక్షరదర్బార్, ములుగు: జిల్లాలో ఇసుక అక్రమ రవాణపై నిఘా ఉంచాలని ములుగు జిల్లా ఎస్పీ డా శబరిష్ అన్నారు. చెక్ పోస్టుల్లో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఇసుక  అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆదేశించారు. ములుగు జిల్లా కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం జిల్లా ఎస్పీ డా శబరిష్ నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్, సస్పెక్ట్ షీటర్స్ గురించి ఆరా తీసి, వారిని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ ఉండాలని, వారి వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా జిల్లాలో విగ్రహాలు ప్రతిష్టించే ప్రతి ఒక్కరు కూడా ఆన్లైన్ దరఖాస్తు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మండపాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా చూడాలని అన్నారు. విగ్రహాల ఏర్పాటు అనంతరం వాటిని జియో టాగింగ్ చేయాలని సూచించారు. మండపాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ కావలసిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ నెలలో నమోదైన కేసుల వివరాలపై పోలీస్ స్టేషన్ వారీగా ఆరా తీసి, కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో  ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తును ముమ్మరం చేయాలని, పోగొట్టుకున్న నగదు లేదా వస్తువులను బాధితులకు అప్పగించేలా కృషి చేయాలి అని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన తీసుకొని వచ్చి కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. యువత ఆన్లైన్ బెట్టింగ్  వలలో పడి మోసపోకుండా పోలీస్ స్టేషన్ వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎవరైనా ఆన్లైన్ బెట్టింగ్ ని ప్రోత్సహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో  ఏటూరునాగారం ఏఎస్పి శివం ఉపాధ్యాయ, ములుగు డీఎస్పీ రవీందర్,  ఎస్బీ ఇన్ స్పెక్టర్ శంకర్, సీసీఎస్ ఇన్ స్పెక్టర్ కుమార్,  సీఐలు శ్రీనివాస్, సురేష్, రమేష్, దయాకర్, ఎస్సైలు వెంకటేశ్వరరావు, రాజు, కమలాకర్, శ్రీకాంత్ రెడ్డి, రాజ్ కుమార్, సురేష్, వెంకటేష్, సతీష్ , కృష్ణ ప్రసాద్, తిరుపతి, డీసీసఆర్బీ ఎస్సై జగదీష్, ఐటీ కోర్ టీం సిబ్బంది పాల్గొన్నారు.



# అలరించిన మండల స్థాయి టీఎల్ఎం మేళా

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన  ఉపాధ్యాయులు తయారుచేసిన కృత్యాల మేల పలువురుని అలరించింది.  మండలం పరిధిలో ఉన్న వివిధ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తయారుచేసిన కృత్యాలు ఇక్కడ ప్రదర్శించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ రఘుపతి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థులు సులభతరంగా అర్థం చేసుకునే విధంగా కృత్యాలు ఉన్నాయని ఆయన కొనియాడారు. టిఎల్ఎం  ఉపయోగించటం వల్ల బోధన సులభతరమై విద్యార్థి త్వరగా నేర్చుకోవడానికి అవకాశం ఉంటుందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నేర్పటంలో సృజనాత్మకతను చూపాలన్నారు. ఇందులో పాఠశాల ఇన్చార్జి రాజమౌళి, సుజాత, నీలిమారెడ్డి, శంకర్, సరళ దేవి మరియు వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు.  సీఆర్పీలు  పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం..

## పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..




అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలోని వరికోల్ ఎంపీపీ ఎస్ పాఠశాలలో విద్యార్థులతో మట్టి వినాయకులను తయారు చేయించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు  శరత్. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దామని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసే విగ్రహాలు నీటిని, వాతావరణాన్ని కలుషితం చేస్తాయని మట్టి వినాయకులు నీళ్లలో నిమజ్జనం చేస్తే నీటిని శుద్ధి చేస్తాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీజీ హెచ్ఎం విజయలక్ష్మి, అశోక్, సరిత, రాధిక విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేత మట్టి వినాయకులను తయారు చేయించి అవగాహన కల్పించారు. ఉత్తమ విగ్రహాలకు ఎంఈవో కోడెపాక రఘుపతి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కృత్రిమ రంగులు పర్యావరణానికి హాని చేస్తాయని పర్యావరణహితంగా పండగలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొమ్మ రాజమౌళి, సరళ దేవి, శ్రీనివాస్,విజయలక్ష్మి,కల్పన నీలి మారెడ్డి,సుజాత, సదయ్య, శంకర్, సూధం సాంబమూర్తి, ఉస్మాన్ అలీ, మౌనిక, బుజ్జమ్మ పాల్గొన్నారు.

# భూభారతి పరిష్కారంలో జాప్యం చేయొద్దు

- దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.భూభారతి పరిష్కారంలో అధికారులు జాప్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలనీ సూచించారు.భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను స్థానిక తహసిల్దార్ సత్యనారాయణ,ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.మండల వ్యాప్తంగా భూభారతి దరఖాస్తులు ఎన్ని వచ్చాయని, అందులో ఎన్నిటిని ఆమోదించారని, ఎన్ని దరఖాస్తులు తిరస్కరణ అయ్యాయని తహసీల్దార్, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తులలో ఏ ఏ కారణాల చేత తిరస్కరణ అయ్యాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.తిరస్కరణ అయిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేయాలని, ఏయే ఆధారాలతో భూమిపై ఉన్నారనే వివరాలను విచారించాలన్నారు.భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలని, ప్రతిరోజు పురోగతి ఉండాలన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే పాఠశాలను సందర్శించారు. ఆర్డీఓ నారాయణ , ప్రభుత్వ అధికారులు, ఎస్సై పరమేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915